ఈనాడు చిత్తూరు

సోమవారం అక్టోబరు 14, 2024



నిత్య నిర్మలా.. జయ మంగళా

కనుల పండువగా భాగ్ సవారి

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారికి ఏడాదిలో నిర్వహించే ఉత్సవాల్లో ఒకటైన భాగ్ సవారి ఆదివారం సాయంత్రం వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాలు పూర్తయిన మరుసటిరోజు దీనిని నిర్వహించడం ఆనవాయితీ. స్వామివారు సాయంత్రం 4 గంటలకు వైభవోత్సవ మండపం నుంచి బయలుదేరి అప్రదక్షిణంగా అనంతాళ్వారు తోటకు చేరి అక్కడ ప్రత్యేక పూజలందుకొని తిరిగి ఆలయంలోకి ప్రవేశించడంతో వేడుక ముగిసింది.



◗ ఆగమోక్తంగా చక్రస్నానం ◗ ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన శనివారం రాత్రి బంగారు తిరుచ్చి ఉత్సవం వైభవంగా జరిగింది. అనంతరం ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. అంతకుముందు తెల్లవారు జామున స్వామివారికి పల్లకీ ఉత్సవం జరిగింది. అనంతరం శ్రీభూవరాహ స్వామి ఆలయ ముఖ మండపంలో భూదేవి, శ్రీదేవి సమేత శ్రీమలయప్పస్వామి, శ్రీసుదర్శన చక్రత్తాళ్వార్‌కు స్నపన తిరుమంజనం, చక్రస్నానం నిర్వహించారు. శ్రీవారి పుష్కరిణిలో సుదర్శన చక్రాన్ని పవిత్ర జలంలో ముంచి స్నానం చేయించారు. భారీగా భక్తులు స్నానమాచరించారు.





జపాన్ చిన్నారులకు గోవింద నామాలు

పొంచి ఉన్న తుపాను ముప్పు



చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడనున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తం అయ్యారు. ఉత్తర తమిళనాడు, దక్షిణ ఆంధ్రప్రదేశ్ మీదుగా ద్రోణి ప్రయాణించే అవకాశం ఉండటంతో అతి భారీవర్షాలు కురిసే అవకాశం ఉంది. 14, 15, 16, 17న న భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ముందస్తు సహాయ చర్యలకు సిద్ధమయ్యారు. సముద్ర తీర ప్రాంతాల్లో గంటకు 55 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని, జాలర్లు వేటకు వెళ్లకూడదని వాతావరణ శాఖ హెచ్చరించింది.

జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, వాతావరణ కేంద్రం హెచ్చరికల నేపథ్యంలో ఆదివారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. అధికారులు ప్రధాన కార్యస్థానంలో అందుబాటులో ఉండాలని, జిల్లాలో ఎక్కడా ప్రాణ, పశు, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్నవారిని సురక్షిత ప్రాంతాలు, పునరావాస కేంద్రాలకు తరలించాలని, చెరువులు, వాగులు, వంకల వద్ద అప్రమత్తంగా ఉండాలని, జలాశయాల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని అధికార యంత్రాంగాన్ని ఆయన ఆదేశించారు.

భారీ వర్షాలు.. అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్న నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. 24 గంటలు పనిసేలా కంట్రోల్ రూంలో రెండు షిఫ్టుల్లో సిబ్బందికి విధులు కేటాయించామని, సహాయ చర్యల నిమిత్తం 94910 77356 నంబరులో సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

15 మండలాల్లో వర్షం

చిత్తూరు (మిట్టూరు), న్యూస్‌టుడే: అల్పపీడన ప్రభావంతో శనివారం రాత్రి జిల్లాలోని 15 మండలాల్లో వర్షం కురిసింది. ఎస్ఆర్‌పురం మండలంలో 28.4 మి.మీ., గుడిపాల 11.2, రామకుప్పం 10.2, తవణంపల్లె 8.8, పాలసముద్రం 8.2, సదుం 7.2 మి.మీటర్లు కురవగా.. మిగిలిన మండలాల్లో చిరుజల్లుల వర్షపాతం నమోదైంది. అల్పపీడన ప్రభావంతో ఆదివారం జిల్లాలోని పలు మండలాల్లో వర్షం కురిసింది.

శ్రీవారి సర్వదర్శనానికి 24 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: టికెట్లు లేకుండా ఆదివారం సాయంత్రానికి తిరుమల వచ్చిన భక్తులకు 24 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. శనివారం చక్రస్నానం అనంతరం శ్రీవారిని దర్శించుకునే వారితో ఆదివారం రద్దీ పెరిగింది. రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల భక్తులకు 3 గంటలు పడుతోంది. శనివారం శ్రీవారిని 73,684 మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.2.72 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

తితిదేలో త్వరలో మరిన్ని బదిలీలు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాలు ముగిసిన నేపథ్యంలో తితిదేలో ఉద్యోగుల బదిలీ ప్రక్రియ పునఃప్రారంభం కానుంది. సెప్టెంబర్ రెండో తేదీన 19 మంది ఏఈవోలు, 62 మంది సూపరింటెండెంట్లను బదిలీ చేశారు. ఇదే సమయంలో దిగువస్థాయి సిబ్బంది 350 మందికి పైగా బదిలీలకు సంబంధించిన కసరత్తు జరిగింది. అయితే అప్పట్లో కొన్ని ఒత్తిళ్ల కారణంగా యూడీసీ, ఎల్డీసీ, షరాబు, అటెండర్ స్థాయి సిబ్బంది బదిలీ ప్రక్రియ ఆగింది. ప్రస్తుతం ఈ ఇది మళ్లీ ప్రారంభం కానున్నట్లు సమాచారం. సోమవారం దేవస్థానం ఉద్యోగుల సహకార బ్యాంకు ఎన్నికల ప్రకటన వెలువడనుంది. 28వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో బదిలీల ప్రక్రియ ఎన్నికల అనంతరం నిర్వహించాలా లేక ఈ మధ్యలోనే పూర్తిచేయాలా అనే అంశంపై మీమాంస నెలకొంది. దీనిపై త్వరలో స్పష్టత రానున్నట్లు తెలుస్తోంది.

నారా భువనేశ్వరి పర్యటన వాయిదా

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: సీఎం నారా చంద్రబాబు నాయుడి సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు ట్రస్టీ నారా భువనేశ్వరి నాలుగు రోజుల కుప్పం పర్యటన వాయిదా పడింది. ఈ మేరకు కుప్పం తెదేపా వర్గాలు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపాయి. సోమవారం నుంచి ఆమె కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాలతో పాటు పలమనేరు నియోజకవర్గం వి.కోటలో పర్యటించాల్సి ఉంది. ఈ మేరకు పర్యటన పార్టీ వర్గాలు ఖరారు చేసి షెడ్యూల్ సైతం ప్రకటించారు. అయితే సోమవారం నుంచి తుపాను కారణంగా పర్యటన వాయిదా పడినట్లు ప్రకటనలో పేర్కొన్నారు.



ఘనంగా పార్వేట ఉత్సవం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీదేవీ నవరాత్రి వార్షికోత్సవాల ముగింపు సందర్భంగా పార్వేట ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ విశేషోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రాత్రి శ్రీజ్ఞానప్రసూనాంబిక సమేత సోమస్కందమూర్తి ఉత్సవమూర్తులను చప్పరాలపై ఊరేగించారు. పట్టణ సరిహద్దు ప్రాంతమైన కాసా గార్డెన్ వరకు అడుగడుగునా భక్తులు ఉత్సవమూర్తులకు స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు. ఈ విశేషోత్సవం సందర్భంగా ఉత్సవం ముందు 108 దుర్గలతో చిన్నారులు, యువతులు విశేష ప్రదర్శనగా తరలిరావడం మరింత శోభాయమానంగా సాగింది. ఈవో చంద్రశేఖర్ ఆజాద్ ఇతర అధికారులు పాల్గొన్నారు.



సీఎం కంటివైద్య కేంద్రాల మూత

కొనసాగిస్తే పేదలకెంతో మేలు

పుంగనూరు, న్యూస్‌టుడే: పేదలకు ఉపయోగపడిన ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రాలు మూతపడ్డాయి. 2018 ఫిబ్రవరిలో నాటి తెదేపా ప్రభుత్వం అపోలో ఆస్పత్రి యాజమాన్యంతో కుదిరిన ఒప్పందం ప్రకారం ఇవి ప్రారంభించారు. ఒప్పందం సెప్టెంబర్ 4తో ముగిసింది. ఫలితంగా చిత్తూరు జిల్లా చంద్రగిరి, నారావారిపల్లె, పి.కొత్తకోట, పీలేరు, పుంగనూరు, సత్యవేడు, తంబళ్లపల్లెలోని మూత పడ్డాయి. వీటిని పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.



అధునాతన యంత్రంతో పరీక్షలు

పరీక్షలు ఇలా..

ఏడాది	మొత్తం
2018-19	41,000
2019-20	42,600
2020-21	6,300
2021-22	21,000
2022-23	29,000
2023-24	31,000
2024-25	26,000

(ఆగస్టు వరకు)

మొదటిసారి టెలీ మెడిసిన్ విధానంలో

ఎలాంటి రుసుములు లేకుండా బాధితులకు టెలీ ఆప్తమాలజీ ద్వారా పరీక్షలు నిర్వహించి వీడియో ద్వారా కంటివైద్య నిపుణులు గుర్తించి తగిన సూచనలు అందించేవారు. కంటి వైద్య నిపుణుల సూచనల మేరకు టెలీ ఆప్తమాలజీ కేంద్రంలోని సిబ్బంది బాధితుడికి సేవలు అందిస్తారు.

1.96 లక్షల మందికి లబ్ధి

ఆరేళ్లలో 1,96,900 మంది సద్వినియోగం చేసుకొన్నారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారు ప్రాంతీయ వైద్యశాలలకు లేదా ప్రైవేటు వైద్యశాలకు వెళ్లేవారు. అధునాతన పరికరాలతో జబ్బులు గుర్తించేవారు.

గడువు ముగిసినందునే


అపోలో ఆస్పత్రి - ప్రభుత్వ ఒప్పందం పూర్తయింది. ఆ కేంద్రాలు మళ్లీ ప్రారంభించాలంటే ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం చిన్న పిల్లలకు పరీక్షలు చేస్తున్నాం.

- అప్రిత, జిల్లా నేత్ర వైద్యాధికారిణి, చిత్తూరు

ఒడిసిపడితే.. అమృతం

◗ సిద్ధమైన డీపీఆర్‌లు.. ఇక టెండర్లే ఆలస్యం

◗ నీటి సరఫరా, పైప్‌లైన్ల విస్తరణకు నిధులు



చిత్తూరు నగరం (ఏరియల్ వ్యూ)

చిత్తూరు నగరపాలక సంస్థతోపాటు నాలుగు పురపాలక సంఘాల్లో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడానికి నిర్దేశించిన ప్రాజెక్టుకు సంబంధించిన సవివర నివేదికలు సిద్ధమయ్యాయి. రూ.121.66 కోట్ల వ్యయంతో పట్టణ ప్రజలకు నీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణానికి ఉద్దేశించిన పనులు ప్రస్తుతం టెండర్ల దశకు చేరుకున్నాయి.- **న్యూస్‌టుడే, చిత్తూరు నగరం**

నీటి సదుపాయాలకు కేటాయించిన నిధులు (రూ.కోట్లలో)

పురపాలక సంఘం	పట్టణ పరిధి	శివారు ప్రాంతాలు	మొత్తం
చిత్తూరు	25.95	13.95	39.9
పుంగనూరు	10.71	2.3	13.01
పలమనేరు	4.78	8.68	13.46
నగరి	12.36	3.34	15.70
కుప్పం	9.21	6.74	15.95

- అమృత్ 2.0 కింద చిత్తూరు నగరపాలక సంస్థకు సింహభాగం నిధులు కేటాయించారు. 50 డివిజన్ల పరిధిలో 2.20 లక్షల జనాభా ఉండగా.. రోజుకు 28 ఎంఎల్‌డీల వరకు నీటి అవసరం ఉంది. ప్రస్తుతం 23 ఎంఎల్‌డీల నీటిని మాత్రమే ఎన్టీఆర్ జలాశయం, నగరంలోని 420 బోర్ల ద్వారా ప్రజలకు సరఫరా చేస్తున్నారు. జనాభా అవసరాలకు సరిపడా నీటి సరఫరాపై దృష్టి సారించి.. అమృత్ పథకంలో నగరానికి ప్రాధాన్యతనిచ్చారు. రూ.25.95 కోట్ల వరకు కేటాయించారు. పలమనేరు, కుప్పం, నగరి, పుంగనూరు పురపాలక సంఘాల పరిధిలోనూ డీపీఆర్‌లు సిద్ధమై టెండర్ల దశకు వచ్చాయి. జిల్లాలోని పురపాలక సంఘాల్లో మొత్తం రూ.121.66 కోట్లకు పరిపాలన అనుమతులతోపాటు సాంకేతిక మంజూరుకు ప్రజారోగ్య ఇంజినీరింగ్ విభాగం అధికారులు నివేదికలు తయారు చేశారు.

చిత్తూరు నగరంలో ఇలా..

ఇక్కడ మురుగునీటి శుద్ధి ప్లాంటుకు రూ.23.64 కోట్లు కేటాయించారు. ఇప్పటికే కట్టమంచి, దొడ్డిపల్లి ప్రాంతాల్లో స్థలాలు గుర్తించగా.. వాటి బదలాయింపునకు ప్రభుత్వ అనుమతి రావాల్సి ఉంది. నిర్మాణం పూర్తయితే వృథా నీటిని శుద్ధిచేసి ఇతర అవసరాలకు వినియోగించుకొనే అవకాశం ఉంటుంది.

వ్యయం ఇలా..

జిల్లాకు కేటాయించిన రూ.121.66 కోట్లలో ప్రధానంగా రూ.98.02 కోట్ల వరకు నీటి సదుపాయాలు మెరుగుపరచడానికే వ్యయం చేయనున్నారు. ఇందులో రూ.63.01 కోట్లతో పట్టణాల పరిధిలోనూ, రూ.35.01 కోట్లతో శివారు ప్రాంతాల్లో నీటి సదుపాయం లేని ప్రాంతాల్లో పైప్‌లైన్ల ద్వారా సరఫరా చేయడానికి నిధులు కేటాయించారు.

మిల్లర్ల టోకరా

- ⏩ బస్తాకు రూ.265 నష్టం
- ⏩ తూకాలు, ధరల్లో మోసం
- ⏩ ధాన్యం సేకరణ కేంద్రాలు లేక తిప్పలు

- న్యూస్‌టుడే, పుత్తూరు



పుత్తూరు మండలం తడుకు గ్రామానికి చెందిన రైతు ఆనందయ్య ఖరీఫ్‌లో ఐదెకరాల్లో వరి సాగు చేశాడు. ప్రైవేటు వ్యాపారులకు పొలంలోనే ధాన్యం విక్రయించాడు. గోతాంతో కలిపి 81 కేజీల తూకం వ్యాపారులకు ఇవ్వాలి. వ్యాపారులు తేమ శాతం ఉందని, ధాన్యం శుభ్రంగా లేదని 85 కేజీలు తూకం వేసుకుని మోసం చేస్తున్నారు. ఇది ఒక్క ఆనందయ్యకే జరిగిన మోసం కాదు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం వరి రైతుల దయనీయ స్థితి ఇది.. కేంద్ర ప్రభుత్వం క్వింటా కామన్ వెరైటీకి రూ.2300, సన్న రకాలకు రూ.2,320 నిర్ణయించింది. ఈ మేరకు 80 కేజీల బస్తాకు రైతుకు రూ.1,840 దక్కాల్సి ఉన్నా.. రూ.1,575 చెల్లించి మిల్లర్లు కొనుగోలు చేస్తుండటంతో రైతుకు బస్తాకు రూ.265 వరకు నష్టం వాటిల్లుతోంది.

■ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఖరీఫ్‌లో 25వేల హెక్టార్లలో వరి సాగైంది. చిత్తూరుపరిధిలో ఆగస్టు, సెప్టెంబరు మొదటి వారంలోనే కోతలు మొదలయ్యాయి. ఇక తిరుపతి జిల్లాలోని తూర్పు మండలాల్లో కోతలు పూర్తయ్యాయి. ఇప్పటికీ ధాన్యం సేకరణకు సంబంధించి ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. దీంతో రైతులు బస్తాకు రూ.265 నష్టపోతున్నారు. ఎకరాకు 30 బస్తాలు దిగుబడి అనుకున్నా రూ.7,950 నష్టపోవాల్సి వస్తోంది. దీనికి తోడు తూకాల్లో మోసం వల్ల బస్తాపై రూ.115 వరకు నష్టం వెరసి. ఎకరాకు రూ.3,450 తూకాల్లో మోసపోతున్నారు. ధర, తూకాల్లో మొత్తం ఎకరాకు రూ.11,400 నష్టపోతున్నారు. ఐదెకరాలు సాగు చేసిన వారు రూ.57వేలు నష్టపోతున్నారు. తిరుపతి జిల్లాలోని తూర్పు మండలాల్లో ఒక్కో రైతు 20 నుంచి 30 ఎకరాలు సాగు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో రూ.లక్షల్లో నష్టపోతున్నారు. ఇదంతా దళారులు, వ్యాపారుల జేబుల్లోకి పోతోంది.

తేమ పేరుతో..

ధాన్యంలో తేమ పేరుతో ఒక్కో బస్తాకు 4 నుంచి 5 కేజీలు వ్యాపారులు రైతులను ఏమార్చి తూకాల్లో మోసం చేస్తున్నారు. దీనికి తోడు ఒక్కో రైతుకు ఒక్కో ధర చెల్లిస్తున్నారు. పంట పరిశీలించి ఓ ధర చెప్పేసి అడ్వాన్స్ ఇస్తున్నారు. తీరా కోతలు అయ్యాక ఎక్కువ తేమ, చెత్తాచెదారాలు ఉన్నాయని ధర తగ్గిస్తున్న సందర్భాలు అనేకం. జిల్లా అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ధాన్యం సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

15న చిత్తూరులో గ్రీవెన్స్

చిత్తూరు కలెక్టరేట్, క్రైమ్, న్యూస్‌టుడే: చిత్తూరులోని కలెక్టరేట్, ఏఆర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని 15న నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ తెలిపారు. సోమవారం(14న) జరగాల్సిన కార్యక్రమాన్ని మంగళవారానికి వాయిదా వేశామన్నారు. అర్జీదారులు ఈ మార్పు గమనించాలని వారు సూచించారు.

నేడు, రేపు ఎస్వీయూలో పీజీ ప్రవేశాలు

తిరుపతి (బైరాగిపట్టెడ) : శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ విభాగాల్లో ఖాళీగా ఉన్న సీట్లకు సోమ, మంగళ వారాల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ భూపతినాయుడు తెలిపారు. వివరాలకు 0877-2248589 నంబరులో సంప్రదించాలని, ఆర్‌సెట్ సీట్లు పొందిన అభ్యర్థులు ఈనెల19 లోపు రిపోర్టు చేయాలని కోరారు.

నేడే అదృష్ట పరీక్ష

⏩ 104 దుకాణాలకు కలెక్టర్ పర్యవేక్షణలో లక్కీడిప్

⏩ ఆవెంటనే లైసెన్సు ఫీజు వసూలు ⏩ ఆర్‌ఆర్ గార్డెన్స్‌లో ఏర్పాట్లు పూర్తి

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: ప్రైవేటు మద్యం దుకాణాల టెండర్లకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం చిత్తూరు సంతపేటలోని ఆర్.ఆర్.గార్డెన్స్‌లోని కల్యాణ మండపంలో ఉదయం 8 గంటలకు కలెక్టర్ సుమిత్‌కుమార్ కేటాయింపు ప్రక్రియను ప్రారంభించనున్నారు. ఒకటో దుకాణం నుంచి ఆఖరు దుకాణం వరకు క్రమసంఖ్య ఆధారంగా పెట్టెలో ప్లాస్టిక్ కాయిన్స్‌ను కలెక్టర్ తీయనున్నారు. ఇప్పటికే కల్యాణ మండపంలో ఎక్సైజ్ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. మొత్తం 104 మద్యం దుకాణాలకు 2,266 దరఖాస్తులు రాగా.. వాటిని వీక్షించడానికి దరఖాస్తుదారుతోపాటు మరో ఇద్దరు ముగ్గురు వచ్చే అవకాశాలు ఉండటంతో అధికారులు అందుకు తగ్గట్లు షామియానాలు, కుర్చీలు, తాగునీరు ఏర్పాట్లు చేశారు. కల్యాణ మండపం లోపల, వెలుపల సీసీ కెమెరాల నిఘా ఉంచారు. కేటాయింపుపై ఎవరికీ అపోహలు ఉండకుండా వీడియో కెమెరాలు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పరిసర ప్రాంతాల్లో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసుశాఖ నుంచి 170, ఎక్సైజ్‌శాఖ నుంచి 150 మందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

వరుసగా ముగ్గురి ఎంపిక

ప్రతి దుకాణానికి లక్కీ డిప్‌లో ముగ్గురిని ఎంపిక చేయనున్నారు. ఎంపికైన మొదటి వ్యక్తి ఆ వెంటనే లైసెన్సు ఫీజును చెల్లించి దుకాణాన్ని దక్కించుకోవాలి. ఫీజు చెల్లించలేకపోయినా ఎంపికైన ముగ్గురిలో రెండో వ్యక్తికి అవకాశం ఇస్తారు.

ప్రభుత్వానికి ఆదాయం..

మొత్తం దుకాణాలకు 2,266 దరఖాస్తులు అందగా ప్రభుత్వానికి రూ.45.32 కోట్ల ఆదాయం సమకూరింది. లైసెన్సు ఫీజు రూపంలో మరింత ఆదాయం సమకూరనుంది. 104 మద్యం దుకాణాలకు రెండు శ్లాబ్‌లు ఉన్నాయి. 34 దుకాణాలకు రూ.55 లక్షలు చొప్పున రూ.18.70 కోట్లు, 70 దుకాణాలకు రూ.65 లక్షలు చొప్పున రూ.45.50 కోట్లతో 2024-25 సంవత్సరానికి లైసెన్సు ఫీజు రూపంలో మొత్తం రూ.64.20 కోట్లు సమకూరనుంది.

చిత్తూరు

• చిత్తూరు • పూతలపట్టు • గంగాధరనెల్లూరు • నగరి

బ్రాహ్మణ సంక్షేమానికి ప్రభుత్వం కృషి

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: బ్రాహ్మణుల సంక్షేమం కోసం ఎన్నికల హామీలు రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చడం శుభపరిణామమని చిత్తూరు జిల్లా బ్రాహ్మణ సంఘం నాయకులు రామభద్ర తెలిపారు. ధూప, దీప, నైవేద్య సాయం పెంపు, వైదిక ఆగమ అంశాల్లో ఆలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిన సందర్భంగా ఆదివారం అమరావతిలో మంత్రి నారా లోకేశ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌కు పూర్వ వైభవం తీసుకురావాలని మంత్రి లోకేష్‌కు ఆయన విన్నవించారు.


మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన బ్రాహ్మణ సంఘం నాయకులు రామభద్ర

వేడుకగా సాయి సమాధి పూజ.. పెనుమూరు: సాయిబాబా మహాసమాధి చెందిన తిథిని పురస్కరించుకుని బాబా, బాబూజీ చిత్రపటాలు పల్లకిలో ఉంచి నగర సంకీర్తన నిర్వహించారు. సాయిపథంలో సాయినామ సంకీర్తన జరిగింది.

లోకనాథం ఎన్నిక



కార్వేటినగరం, న్యూస్‌టుడే: నగరి డివిజన్ వీరశైవ సంఘం అధ్యక్షుడిగా కార్వేటినగరానికి చెందిన లోకనాథం ఎన్నికయ్యారు. నగరంలో శనివారం జరిగిన డివిజన్ సమావేశంలో తనను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 80085 74568
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 80085 74601

న్యూస్‌టుడే, చిత్తూరు నగరం

సమస్య: దొడ్డిపల్లి జయచంద్ర కాలనీలోని డ్రైనేజీ కాలువల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. **-స్థానికులు**

సమాధానం: డ్రైనేజీ కాలువల్లో పూడికతీత పనులు చేయిస్తాం. **-అనిల్ కుమార్, ఆరోగ్యాధికారి, నగరపాలక సంస్థ**

న్యూస్‌టుడే, యాదమరి

సమస్య: కాశిరాళ్ల కొత్తూరు సమీపంలో అంతర్రాష్ట్ర రహదారిలోని కల్వర్టుకు రంధ్రం ఏర్పడి ప్రమాదకరంగా ఉంది. **-స్థానికులు**

సమాధానం: కల్వర్టు వద్ద గొయ్యిని తాత్కాలికంగా పూడ్చి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేస్తాం. **-ఆదికేశవులు, ఏఈ, ఆర్‌అండ్‌బీ**

న్యూస్‌టుడే, బంగారుపాళ్యం

సమస్య: నల్లరాపల్లె-వెంకటాపురం మార్గం పక్క పొలాల్లోని విద్యుత్తు స్తంభానికి తీగలు అలుముకుని సర్క్యూట్ అయి సరఫరాలో అంతరాయం కలుగుతోంది. **-రామలింగ, రైతు**

సమాధానం: ఈ విషయం తన దృష్టికి రాలేదు. విద్యుత్తు స్తంభానికి అలుముకున్న తీగలు తొలగించి సమస్య పరిష్కరిస్తాం. **-హేమచంద్ర, ఏఈ, విద్యుత్తు శాఖ**

యువత క్రీడా స్ఫూర్తితో మెలగాలి

జీడీనెల్లూరు, న్యూస్‌టుడే: యువత క్రీడాస్ఫూర్తితో మెలగాలని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ కోరారు. చిన్నతయ్యూరులో ముగిసిన క్రికెట్ టోర్నీ విజేతలకు ఆదివారం ఆయన బహుమతులు, కప్పు అందజేశారు. గ్రామస్థులు, నిర్వాహకులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే థామస్

వైభవంగా అంకాళపరమేశ్వరి కుంభాభిషేకోత్సవాలు

జీడీనెల్లూరు: క్రిష్ణంపల్లెలో పోలు వంశస్థులచే నిర్మించిన నూతనంగా అంకాళపరమేశ్వరి ఆలయ మహాకుంభాభిషేకోత్సవాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకపూజలు, అభిషేకాలు, అగ్నిహోమం, పలురకాల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. **పెనుమూరు:** కలికిరికొండకు భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం గోవిందనామ స్మరణతో మార్మోగింది. శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి అర్చకులు వేదమంత్రాల మధ్య పూజలు నిర్వహించారు. తిరిగి ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ పర్యవేక్షించారు. ❖ వేపంజేరి శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. శ్రీదేవి, భూదేవి సమేత నారాయణస్వామికి ప్రత్యేకపూజలు చేసిన అనంతరం ఉత్సవమూర్తులకు పుష్కరిణిలో చక్రస్నానం, సాయంత్రం ధ్వజావరోహణం ఉత్సవాలు ముగిశాయి.


జీడీనెల్లూరు: యాగశాలలో అర్చకులు

ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత డీఎస్సీ శిక్షణ.. జీడీనెల్లూరు: టెట్‌లో ఉత్తీర్ణులైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత డీఎస్సీ శిక్షణ ఇవ్వనున్నట్లు సామాజిక సంక్షేమశాఖ ఉప సంచాలకులు షకీల ఆదివారం తెలిపారు. ఆమె స్థానిక వసతిగృహంలో ఆదివారం మాట్లాడుతూ ఆసక్తి ఉన్నవారు ఈ నెల 21లోగా జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో అంతర్జాలం ద్వారా నమోదు చేసుకోవాలన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌కు సన్నద్ధత

● పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి ● పరిశుభ్రత పెంపునకు ప్రత్యేక చర్యలు * ఉత్తమ ర్యాంకే లక్ష్యంగా అడుగులు

న్యూస్‌టుడే, చిత్తూరు నగరం

చిత్తూరు నగరంలో పారిశుద్ధ్యం పెంపుదలకు నగరపాలక సంస్థ చర్యలు ముమ్మరం చేపట్టింది.. ఈ ఏడాది స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఇటు రాష్ట్రంలో.. అటు దేశవ్యాప్తంగా ఉత్తమ ర్యాంకు సాధనే లక్ష్యంగా సిబ్బంది నుంచి అధికారుల వరకు అందరూ సమష్టిగా నిర్విరామ కృషి చేస్తున్నారు.. గత అనుభవాల దృష్ట్యా పాఠాలు నేర్చుకుని తప్పిదాలకు తావులేకుండా వంద శాతం పారిశుద్ధ్యం మెరుగుదల కోసం నిత్యం శ్రమిస్తున్నారు.

పరిశుభ్రతే ప్రధానం..

స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే ప్రధానంగా పరిశుభ్రతపైనే ఉండనుంది. ఈ సర్వేలో స్వచ్ఛతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. చిత్తూరు నగరపాలక పరిధిలో ప్రతిరోజు ఇంటింటా 65 టన్నుల చెత్త, ఇతర వ్యర్థాలను పారిశుద్ధ్య సిబ్బంది సేకరించి నగర సమీపంలోని లెనిన్‌నగర్‌లో కంపోస్టుయార్డుకు తరలిస్తున్నారు. ఇందుకు 177 మంది పొరుగు సేవలు, 135 మంది శాశ్వత పద్ధతిపై పారిశుద్ధ్య కార్మికులు నిత్యం విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రతి ఆవాసానికి ఇద్దరు నుంచి ముగ్గురు పారిశుద్ధ్య కార్మికుల్ని నియమించారు. ఇలా నగరంలో తమకు కేటాయించిన ప్రాంతాల్లో మాత్రమే సదరు కార్మికులు ఉదయం చెత్త సేకరణ, మధ్యాహ్నం రోడ్లు, మురుగునీటి కాలువల్ని శుభ్రం చేయడం తదితర పనులు చేపడుతున్నారు. డివిజన్ల వారీగా కాకుండా కేటాయించిన ప్రాంతాల్లో కార్మికుల్ని నియమించడం ద్వారా విధి నిర్వహణలో బాధ్యత, జవాబుదారీతనం మరింతగా పెంచారు. ప్రతి ఆవాసం, వీధుల్ని జల్లెడపట్టి చెత్త, వ్యర్థాలు లేకుండా ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య కార్మికులు తొలగింపజేస్తున్నారు. తద్వారా నగరాన్ని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు.



నగరంలో నిర్మించిన సామాజిక మరుగుదొడ్డి

చెత్త సేకరణలో మార్పులు..

నగరంలో పారిశుద్ధ్యం నిర్వహణలో కీలక మార్పులు తీసుకొచ్చారు. ప్రతి రెండు డివిజన్లకు ఒక పారిశుద్ధ్య మేస్త్రీ, ఒక ట్రాక్టర్, డంపర్ ప్లేసర్, టిప్పర్లను కేటాయించారు. చెత్త సేకరణ, బదిలీ పాయింట్ల సంఖ్య పెంచారు. వాణిజ్య ప్రాంతాల్లో ప్రతి దుకాణానికి రెండు చెత్త బిన్లు ఇచ్చారు. నగరం మొత్తం చెత్త సేకరణ కోసం 150 తోపుడు బండ్లు అందుబాటులో ఉంచారు. పారిశుద్ధ్య కార్మికుల పనితీరును పర్యవేక్షించడానికి ప్రత్యేకంగా ఓ బృందాన్ని నియమించారు. తమ నివాస, వాణిజ్య సముదాయాలను పరిశుభ్రంగా పెట్టుకోవాలని ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు విస్తృత ప్రచారం చేపట్టారు. నగరంలోని ప్రధాన కూడళ్లు, వాణిజ్య సముదాయాలు, వర్తక దుకాణాలు, ప్రధాన వీధులను శుభ్రంగా పెట్టుకోవడానికి సంబంధిత ప్రాంతాలవారికి ఆదేశాలు సైతం జారీ చేశారు.


చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయం

ఉత్తమ ర్యాంకు లక్ష్యం..

ఈ ఏడాది స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంకు లక్ష్యంగా పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించాం. పారిశుద్ధ్య మేస్త్రీలు, పర్యావరణ కార్యదర్శుల పర్యవేక్షణలో ప్రతిరోజూ నిర్ణీత ఆవాసాల్లో వంద శాతం పారిశుద్ధ్య పనులు జరిగేలా చర్యలు చేపట్టాం. ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకుని తదనుగుణంగా ముందుకు సాగుతున్నాం. **-అనిల్ కుమార్, ఆరోగ్యాధికారి, నగరపాలక సంస్థ**


జెండా ఊపి బస్సు సర్వీసు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోండి

చిత్తూరు(కొంగారెడ్డిపల్లి), న్యూస్‌టుడే: చిత్తూరు ఆర్టీసీ బస్టాండులో శనివారం ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ రెండు ఆర్టీసీ బస్సు సర్వీసులను జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం చిత్తూరు-వేలూరుకు ఎక్స్‌ప్రెస్ బస్సులు ప్రారంభించామని, ఇవి నాన్-స్టాప్‌లన్నారు. ప్రజలందరూ ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకుని ఆర్టీసీ అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. అవసరమైతే త్వరలో అదనపు బస్సులు కేటాయించడానికి కృషిచేస్తామన్నారు. డీపీటీవో జగదీష్, చిత్తూరు ఆర్టీసీ ఒకటో డిపో మేనేజర్ రూపశ్రీ, తెదేపా నాయకులు వసంత్‌కుమార్, ఇతర అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

చర్చివీధిలో దుకాణం కూల్చివేత

చిత్తూరు(నేరవార్తలు), న్యూస్‌టుడే: చర్చివీధిలో కొద్దికాలంగా వివాదాల్లో ఉన్న దుకాణం ఇద్దరి పేరుతో ఉంది. దీన్ని వారిలో ఒకరు జేసీబీ సాయంతో కూల్చివేశారు. రేకుషెడ్డు, అందులో ఉన్న బూడిద గుమ్మడికాయ, ఇతర వస్తువులన్నీ పాడైపోయి నష్టం వాటిల్లాయి. ఉన్నపళంగా దాన్ని కూల్చడంతో మాజీ మేయర్ కఠారి హేమలత, ఆమె వర్గీయులు పెద్దసంఖ్యలో చేరుకున్నారు. కోర్టులో కేసు నడుస్తున్నా.. దుకాణాన్ని ఎలా కూలుస్తారని రోడ్డెక్కారు. ఆమెతో పాటు ఆమె కుటుంబ సభ్యులు, తెదేపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో గుమికూడారు. ఉద్రిక్తతకు దారితీయకుండా డీఎస్పీ సాయినాథ్, వన్‌టౌన్ సీఐ జయరామయ్య ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ జయరామయ్య తెలిపారు.



❖ చిత్తూరు(క్రీడలు): పొన్నియమ్మన్ ఆలయంలో సుమంగళి దేవి అలంకరణ ❖ కలెక్టరేట్: డీఐరోడ్డులోని అంకాళ పరమేశ్వరి ఆలయంలో రాజరాజేశ్వరిగా.. ❖ జీడీనెల్లూరు: పుష్పపల్లకిలో ఊరేగుతున్న అల్లియల్లమ్మ ❖ జీడీనెల్లూరు: గాజుల అలంకారంలో ముక్కళత్తూరు గంగమ్మ ❖ పెనుమూరు: సి.రామాపురంలో రాజరాజేశ్వరీదేవి అలంకరణలో శ్రీప్రసన్న పార్వతీదేవి ❖ కార్వేటినగరం: గ్రామవీధుల్లో ఊరేగుతున్న రాజరాజేశ్వరీదేవి ❖ నగరి: సత్రవాడలోని కరి వరదరాజస్వామి ఆలయంలో ఊరేగుతున్న స్వామివారు ❖ నగరి: రాజరాజేశ్వరి అలంకరణలో దేశమ్మ.. ❖ పుత్తూరు: ఆరేటమ్మ అలంకరణలో గ్రామ దేవత ఆరేటమ్మ ❖ పుత్తూరు: రాజరాజేశ్వరి అలంకరణలో శ్రీమానసాదేవి




❖ సంతపేట: నవచండీదేవికి హారతిస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ ❖ సంతపేట: సంతపేటలో విజయలక్ష్మి అలంకరణలో దుర్గమ్మ విహారం ❖ కలెక్టరేట్: గిరింపేటలో దుర్గాంబ దేవస్థానం గ్రామోత్సవంలో విజయలక్ష్మీదేవిగా.. ❖ జీడీనెల్లూరు: దుర్గామాతగా ఎగవూరు సత్యమ్మ ❖ బంగారుపాళ్యం: వజ్రాలపురం బోయకొండ గంగమ్మ ఆలయంలో చండీహోమం ❖ తవణంపల్లె: దిగువ మాఘం వీధుల్లో విహరిస్తున్న అన్నపూర్ణాదేవి ❖ కాణిపాకం: శమీ వృక్షం వద్ద పూజలు చేస్తున్న అర్చకుడు ❖ పుత్తూరు: రాజరాజేశ్వరీదేవి అలంకరణలో శ్రీద్రౌపదీదేవి


పుత్తూరు: విశేష అలంకరణలో ఓంశక్తి అమ్మవారు

విజయలక్ష్మీ.. నమోస్తుతే

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: దేవీ నవరాత్రి ఉత్సవాలు చిత్తూరు నగరంలోని ఆలయాల్లో వైభవంగా ముగిశాయి. సంతపేటలోని జీజేఎం సుఖీభవ హాల్‌లో నవ చండీదేవి హోమంలో భాగంగా మహా పూర్ణాహుతి శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం చండీదేవిని ప్రార్థిస్తూ పూజలు చేశారు. కొంగారెడ్డిపల్లెలోని శ్రీవేంకటేశ్వర కృష్ణాంజనేయ స్వామి ఆలయంలో శ్రీ రాజరాజేశ్వరీదేవికి పాలాభిషేకం చేశారు. స్థానికులు యువరాజులునాయుడు, రాధాకృష్ణ.. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అమ్మవారి ఉత్సవర్లను పురవీధుల్లో ఊరేగించారు.


పుత్తూరు: విశేష అలంకరణలో శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీదేవి

అన్నదానానికి విరాళం

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దర్శనార్థం వచ్చే భక్తులకు అందిస్తున్న నిత్యాన్నదాన పథకానికి చిత్తూరు మురకంబట్టు కోడిగుంటకు చెందిన ఎ.మోతీష్ రూ.లక్ష మొత్తాన్ని ఆలయ ఇన్‌స్పెక్టర్ రవికి అందజేశారు. దాత, కుటుంబ సభ్యులకు స్వామివారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందించారు. పండితులు వేదాశీర్వచనం చేశారు.


విరాళం అందిస్తున్న మోతీష్ కుటుంబ సభ్యులు

గణనాథుడి సేవలో జేసీ విద్యాధరి


జేసీ విద్యాధరికి స్వామివారి జ్ఞాపిక అందజేస్తున్న ఏఈవో రవీంద్రబాబు

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారిని జేసీ విద్యాధరి కుటుంబ సభ్యులతో కలసి శనివారం దర్శించుకున్నారు. ఏఈవో రవీంద్రబాబు, అర్చకులు రాజగోపురం వద్ద స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. జేసీకి స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. పండితులు వేదాశీర్వచనం చేశారు.


దసరా సందర్భంగా వాహనాలకు పూజలు చేయించుకునేందుకు వాహనదారులు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి తరలి వచ్చారు. -న్యూస్‌టుడే, కాణిపాకం

బాలిక అదృశ్యం

యాదమరి, న్యూస్‌టుడే: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైందని ఆమె తల్లి ఆదివారం ఫిర్యాదు చేశారని ఎస్సై ఈశ్వర్ తెలిపారు

భార్యాభర్తలకు తీవ్రగాయాలు

గుడిపాల, న్యూస్‌టుడే: మండలంలోని చిత్తూరు-వేలూరు జాతీయ రహదారిలో ఆదివారం గుడిపాల క్రాస్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో చిత్తూరు రూరల్ మండలం మాపాక్షికి చెందిన భార్యాభర్తలు చొక్కనాధం, లక్ష్మి తీవ్రంగా గాయపడ్డారు. ద్విచక్ర వాహనంలో రోడ్డు దాటుతుండగా కుక్క అడ్డుగా రావడంతో అదుపు తప్పి పడిపోవడంతో వారి తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో బాలికకు..

బంగారుపాళ్యం: చిత్తూరు-పలమనేరు జాతీయ రహదారిలోని మొగిలి ఘాట్‌రోడ్డులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలికకు గాయాలయ్యాయి. బెంగళూరు నుంచి తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనార్థం వెళ్తున్న కారు ఘాట్‌రోడ్డులో అదుపు తప్పి ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ప్రవల్లికకు గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు భళా..

☛ పట్టుదలతో ముందుకు
☛ నెట్‌బాల్‌లో రాణింపు


నెట్‌బాల్ ఆడుతున్న విద్యార్థులు

న్యూస్‌టుడే, పుత్తూరు

పల్లె విద్యార్థులు క్రీడల్లో పట్టుదలతో లక్ష్య సాధన దిశగా పయనిస్తున్నారు.. పాఠశాలలో చేరిన నాటి నుంచి చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి తమ సత్తా చాటుతున్నారు పుత్తూరు మండలం గొల్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు.. ప్రధానోపాధ్యాయురాలు, వ్యాయామ ఉపాధ్యాయుడి శిక్షణతో నెట్‌బాల్‌లో మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచి ముందుకు సాగుతున్నారు.

ఇతరులకు ఆదర్శం..



పుత్తూరు మండలం ఆనంబట్టు గ్రామానికి చెందిన మన్నెప్పరెడ్డి, శైలజ కూతురు జాహ్నవి పదో తరగతి విద్యార్థిని. తండ్రి పెయింటర్. చిన్ననాటి నుంచే ఆటలంటే మక్కువ. దీంతో తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు. అండర్-17 నెట్‌బాల్ విభాగంలో ఇటీవల చినతిప్పసముద్రంలో జరిగిన పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. త్వరలో అన్నమయ్య జిల్లా చినతిప్పసముద్రంలో జరిగే పోటీలకు అర్హత సాధించింది. వ్యూహాత్మకంగా వ్యవహరించి లక్ష్య సాధన దిశగా ఆడటం ఆమె ప్రత్యేకత.

జట్టు విజయంలో కీలకం..



పుత్తూరు మండలం ఆనంబట్టు గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థిని హేమనందిని సురేష్, మంజుల దంపతుల కుమార్తె. తండ్రి వ్యవసాయం, తల్లి గృహిణి. చదువు సహా క్రీడల్లోనూ రాణిస్తోంది. గతంలో మండల, జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. ఇటీవల అన్నమయ్య జిల్లా మదనపల్లెలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో రాణించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. త్వరలో ఎన్టీఆర్ జిల్లాలో జరిగే పోటీలకు సిద్ధమవుతోంది.

ఆటల్లో మెరుపు కాంతి..



పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని రామిరెడ్డి, లక్ష్మి దంపతులు రైతులు. వారి కుమార్తె చంద్రకళ పదో తరగతి చదువుతోంది. ఈ విద్యార్థినికి నెట్‌బాల్ అంటే ఇష్టం. ఐదేళ్లుగా సాధన చేస్తోంది. మండల, జిల్లా స్థాయిలో విజేతగా నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. అండర్-17 విభాగంలో శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో జరిగే పోటీలకు అర్హత సాధించింది. పోటీల్లో పాల్గొంటే చాలు జట్టుకు పతకం సాధించడం ఖాయం. భవిష్యత్తులో మంచి క్రీడాకారిణిగా గుర్తింపు సాధించాలనే దిశగా సాధన చేస్తోంది.

ప్రతిభతో ముందుకు..



కట్టకిందరామకృష్ణాపురం గ్రామానికి చెందిన పళనిరెడ్డి, వరలక్ష్మి దంపతుల కుమారుడు ధనుష్ పదో తరగతి చదువుతున్నాడు. తండ్రి మేస్త్రీ. ఆ విద్యార్థి నెట్‌బాల్‌లో చక్కటి ప్రతిభ చూపుతున్నాడు. ఇటీవల చినతిప్పసముద్రంలో జరిగిన నెట్‌బాల్ జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. త్వరలో శ్రీపొట్టిరాములు నెల్లూరు జిల్లాలో జరిగే పోటీల్లో తన సత్తా చాటనున్నాడు.

ఆశలన్నీ అంతర పంటలపైనే..!

● ఖరీఫ్‌లో తప్పని కష్టాలు ● వేరుసెనగ పంటలో మిగిలింది నష్టమే

తవణంపల్లె, న్యూస్‌టుడే: వేరుసెనగ పంటకు సాగునీరు, ఎక్కువ శ్రమ అవసరం లేకుండా సులభంగా సాగు చేయవచ్చు. ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు ఆరంభంలో వర్షాలు ఆశాజనకంగా పడ్డాయి. పూత, ఊడలు దిగే సమయం, ఒబ్బిడి చేసే సమయంలో వర్షాలు సరిగా లేక దిగుబడి బాగా తగ్గింది. అధికారుల లెక్కల ప్రకారం నియోజకవర్గంలో 9,515 హెక్టార్లలో వేరుసెనగ సాగు చేయాల్సి ఉండగా ఈ ఏడాది 2,659 హెక్టార్లలో(30 శాతమే) సాగైంది.


ట్యాంకర్ ద్వారా వేరుసెనగ పంటకు నీరు పడుతున్న రైతులు (పాతచిత్రం)

వర్షాభావ పరిస్థితులతో తిప్పలు..

వేరుసెనగ సాగు ఆరంభంలో విత్తిన తరవాత వర్షాలు పడటంతో దిగుబడిపై రైతులు ఆశలు పెంచుకున్నారు. పూత, ఊడలు దిగే సమయం, పంట ఒబ్బిడి దశలో వర్షాలు లేక వారి కష్టాలు రెట్టింపయ్యాయి. వేరుసెనగ తీగలను భూమి నుంచి వేరు చేయడానికి తేమ లేక ట్యాంకర్లతో పొలాలు తడిపి తీగలు వేరుచేసేందుకు రెట్టింపు ఖర్చయింది. మరికొన్ని చోట్ల పంట ఒబ్బిడి చేసే సమయంలో కూలీలు దొరక్క అన్నదాతల అవస్థలు వర్ణనాతీతం. నష్టాల నేపథ్యంలో వారు అంతర పంటలుగా కంది, అలసంద, పెసలు, ఉద్దులు, అనప, ఉలవ, జొన్నలు, రాగి మేలు చేకూరుస్తాయని సాగు చేశారు.

గంపెడాశలతో ఉన్నాం..



ఈ ఏడాది రెండెకరాల్లో వేరుసెనగ సాగు చేశా. ఆరంభంలో వర్షాలు ఆశాజనకంగా కురిశాయి. తర్వాత ఊడలు, ఒబ్బిడి సమయంలో వర్షాలు లేక దిగుబడి తగ్గింది. పశుగ్రాసానికి వాడే వేరుసెనగ తీగలు తక్కువగా వచ్చాయి. రెండెకరాలకు దుక్కి, ఎరువులు, విత్తనకాయలు, కూలీలు మొత్తం రూ.40 వేలు ఖర్చయింది. కాయలు, తీగలు కలిపితే రూ.20 వేలైనా రాలేదు. అంతర పంటల్లోనైనా లాభం వస్తుందని ఆశలు పెట్టుకున్నాం. **-రమేష్‌బాబు, గళ్లావాళ్లవూరు**

రైతుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి..

ఖరీఫ్‌లో ఆగస్టు, సెప్టెంబరులో సరిగా వర్షాలు కురవక వేరుసెనగ రైతులు ఇబ్బంది పడ్డారు. వారి సమస్యలు ఉన్నతాధికారుల సహకారంతో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. ప్రభుత్వ నిర్ణయం మేరకు రైతులకు న్యాయం చేస్తాం. **-ప్రవీణ్, ఏవో**

కడుపునొప్పి తాళలేక ఆత్మహత్య

నింద్ర, న్యూస్‌టుడే: కడుపునొప్పి తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. మండలంలోని ఎలకాటూరుకు చెందిన ఎ.లక్ష్మణుడు (35) తిరుపతి, చెన్నై తదితర ప్రాంతాల్లో ద్విచక్రవాహనాలు క్రయవిక్రయాలు చేస్తుంటాడు. కడుపునొప్పితో బాధపడుతూ ఇంట్లో విషం తాగడంతో అతడిని నగరి, తిరుపతిలో చూపించి చెన్నై ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతిచెందాడని ఏఎస్సై ప్రభాకర్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పలమనేరు

•పలమనేరు • కుప్పం •పుంగనూరు

సాయిమందిరానికి రూ.లక్ష విరాళం

సదుం, న్యూస్‌టుడే: మండలంలోని స్థానిక గాంధీరోడ్డులో వెలసిన సాయిమందిరానికి విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు నాగభూషణరెడ్డి, సతీమణి రత్నమ్మ రూ.లక్ష విరాళం అందించారు. ఆలయకమిటీ సభ్యులు మునస్వామి, నాగభూషణంకు ఆదివారం అందించారు. విజయదశమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, భజనలు జరిగాయి. అన్నదానం నిర్వహించారు.


ఆలయకమిటీ సభ్యులకు నగదు అందిస్తున్న రత్నమ్మ నాగభూషణరెడ్డి

దరఖాస్తులకు 16న ఆఖరు.. పుంగనూరు: స్థానిక అగ్నిమాపకశాఖ కార్యాలయ పరిధిలో బాణసంచా దుకాణదారులుగా తాత్కాలిక లైసెన్సు పొందడానికి ఈ నెల 16లోపు దరఖాస్తు చేసుకోవాలని అగ్నిమాపకశాఖాధికారి సుబ్బరాజు ఓ ప్రకటనలో తెలిపారు. పుంగనూరు పట్టణం, చౌడేపల్లె, సోమల, కందూరు, పెద్దఉప్పరపల్లె, సదుం, కల్లూరు, రొంపిచర్ల మండలాల వారు స్పందించాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

పుంగనూరు, న్యూస్‌టుడే:

సమస్య: పట్టణ పరిధి మదనపల్లె- చౌడేపల్లె రోడ్డుపై చెత్త కనిపిస్తుంది. స్థానికులు ఇక్కడ తాత్కాలిక చెత్త కుండీ వద్ద పారబోస్తున్నారు. గాలికి రోడ్డుపైకి కొట్టుకు వస్తోంది.
– కార్తీక్, కొత్తపేట

సమాధానం: వెంటనే పరిశీలించి చెత్త సేకరణకు చర్యలు తీసుకుంటాం.
– మధుసూదనరెడ్డి, పుర కమిషనరు

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే

సమస్య: మండల పరిధి రాగానిపల్లె పంచాయతీ అడవినాథునికుంట ఆదర్శ పాఠశాల, జడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీ సమీపంలో చెత్త, వ్యర్థాలతో దుర్వాసన వస్తోంది. పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి.
– వెంకటరమణ, అడవినాథునికుంట

సమాధానం: వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటాం.
– సురేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి

గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగు

స్పందనకు వందనం

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని ఉవలదిన్నెలో శనివారం మురుగు కాలువలు శుభ్రం చేసి వీధుల్లో చెత్త, వ్యర్థాలు తొలగించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. మేమున్నాం.. మీకు తోడుగాలో వచ్చిన వార్తకు స్పందించిన పంచాయతీ కార్యదర్శి నాగభూషణం ఈ మేరకు చర్యలు చేపట్టారు.

డీఎస్సీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కుప్పం, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఉచితంగా అందించే డీఎస్సీ శిక్షణకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి (ఏఎస్‌డబ్ల్యూవో) మీనాక్షి కోరారు. ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల డీఎస్సీ అర్హత పరీక్షకు అవసరమైన శిక్షణ కార్యక్రమాన్ని సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. మూడు నెలల ఉచిత శిక్షణ సంబంధించి టెట్ అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 21 లోపు జ్ఞానభూమి వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 27న స్క్రీనింగ్ టెస్టులో అర్హత సాధించిన వారిని ఎంపిక చేస్తారని తెలిపారు. పుంగనూరు గ్రామీణ: డీఎస్సీ ఉచిత శిక్షణకు ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఏఎస్‌డబ్ల్యూవో నరసింహులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు అభ్యర్థులు స్థానిక ఎస్సీ వసతి గృహ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.


చిన్నారులతో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, జబర్దస్త్ నటులు

సాంస్కృతిక పోటీల్లో చిన్నారుల ప్రతిభ

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: దసరా పండుగ సందర్భంగా రాష్ట్ర పర్యాటకశాఖ ఆధ్వర్యంలో పుట్టపర్తి శిల్పారామంలో శనివారం రాత్రి నిర్వహించిన రాష్ట్ర స్థాయి సాంస్కృతిక పోటీల్లో బైరెడ్డిపల్లె కళాతరంగిణి సంస్థ చిన్నారులు బహుమతులు సాధించినట్లు సంస్థ వ్యవస్థాపకుడు రాజేష్‌బాబు తెలిపారు. లహరి, రమ్య, జాహ్నవి, వరుణ్, మధుశ్రీ, భరత్, చిత్ర, పావని, వరత.. శ్వేత, జానపద నృత్య ప్రదర్శనతో ప్రేక్షకులను కనువిందు చేసి ప్రశంసలు అందుకున్నట్లు చెప్పారు. జబర్దస్త్ నటులు బుల్లెట్‌భాస్కర్, నరేష్, జితేందర్ అభినందనలు తెలిపారు. మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి, శిల్పారామం ఏవో రమేష్‌రెడ్డి బహుమతులు అందించారు.

కైగల్‌ను విస్మరించి.. కన్నీళ్లు మిగిల్చి

◆ వైకాపా పాలనలో సాగని పనులు ◆ అంచనా వ్యయం పెరిగి అదనపు భారం

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: దశాబ్దాలుగా పాలకుల హామీలు నీటి మూటలుగానే మిగులుతున్నాయి. కైగల్ జలాశయం నెరవేరక ప్రజల ఆశలు ఆవిరవుతున్నాయి. గత తెదేపా ప్రభుత్వంలో కైగల్ ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా వైకాపా ప్రభుత్వం విస్మరించింది. ఐదేళ్లలో ఎలాంటి పురోగతి లేక ప్రజలకు కన్నీటి కష్టాలు మిగిల్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కైగల్ జలాశయం నిర్మాణంలో కదలిక వచ్చింది. ఇటీవల రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలించారు. స్థానికుల నుంచి వినతులు స్వీకరించారు. కైగల్ నదికి ఎగువన హంద్రీ-నీవా కాలువ వెళ్తుంది. ఆ జలాలను కైగల్ ప్రాజెక్టును అనుసంధానం చేసేలా జలవనరులశాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది.



కైగల్ నది నుంచి కౌండిన్య అటవీ ప్రాంతం మీదుగా తమిళనాడు చేరుతున్న జలాలు ◆ కైగల్ శిలాఫలకం వద్ద ప్రాజెక్టు తాజా అంచనాలు పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు (పాతచిత్రాలు)

నాడు రూ.16 కోట్లు..
నేడు రూ.29 కోట్లు

కైగల్ జలాశయం నిర్మాణానికి 2019లో తెదేపా ప్రభుత్వం రూ. 16.01 కోట్లు నిధులు మంజూరు చేసింది. 2019 ఫిబ్రవరి 21న అప్పటి మంత్రి అమరనాథరెడ్డి శంకుస్థాపన చేసి ఆరు నెలల్లో ప్రాజెక్టు పూర్తి చేస్తామన్నారు. జలాశయం ఏర్పాటుతో భూగర్భ జలాలు వృద్ధి చెంది సాగునీటికి కొరత ఉండదని అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. తర్వాత ఐదేళ్ల వైకాపా పాలనలో ఎలాంటి పురోగతి లేక ప్ర'జల' ఆశలు అడియాసలయ్యాయి. ప్రభుత్వం జలాశయం నిర్మాణంపై దృష్టి సారించకపోగా అంచనా వ్యయం దాదాపు రెట్టింపు అయింది. 2009 సంవత్సరం నుంచి కైగల్ జలాశయం ప్రాజెక్టు అంచనా వ్యయం పెరుగుతుందే గానీ ప్రాజెక్టు నిర్మాణానికి నోచుకోవడం లేదు.

గణాంకాలు

- పేరు: కైగల్ జలాశయం
- భూసేకరణ: 63.84 ఎకరాలు
- శంకుస్థాపన: 21-02-20219
- మంజూరైన నిధులు: రూ.16.01 కోట్లు
- 2020లో పెరిగిన వ్యయం: రూ. 19 కోట్లు
- 2024లో అంచనా వ్యయం: రూ. 29 కోట్లు
- ప్రయోజనం : బైరెడ్డిపల్లె, వి.కోట (153 గ్రామాలు)

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

బైరెడ్డిపల్లె, వి.కోట మండలాల్లో శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే అమరనాథరెడ్డి దృష్టి సారించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రాజెక్టు విషయాన్ని ఆయన మంత్రి రామానాయుడు, సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి చర్చించారు. వెంటనే మంత్రి నిమ్మల రామానాయుడు కైగల్‌లో పర్యటించడంతో ప్రజల్లో ఆశలు చిగురించాయి. మంత్రి స్థానిక రైతుల సమస్యలు ఆలకించి వినతి పత్రాలు స్వీకరించారు. ప్రాజెక్టు నిర్మాణానికి భరోసా ఇచ్చారు.

నిధులు రాగానే టెండర్లు

తాజా అంచనాలు రూ. 29 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. 2019లో రూ. 16.01 కోట్లు నిధులు మంజూరు చేసినప్పటికీ పనులు జరగలేదు. తాజా ప్రతిపాదనలకు ప్రభుత్వం నుంచి పరిపాలనా అనుమతులు రావాల్సి ఉంది. ఆ వెంటనే నిధులు విడుదలవుతాయి. తర్వాత టెండర్ల ప్రక్రియ ప్రారంభిస్తాం.

- గిరి, జలవనరులశాఖ ఈఈ, పలమనేరు


సమావేశంలో పాల్గొన్న నాయకులు

జిల్లా మహాసభలకు హాజరు కావాలి

పలమనేరు, న్యూస్‌టుడే: సీపీఎం జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయం నుంచి ప్రధాన రహదారిలో శ్రేణులు ర్యాలీ నిర్వహించాయి. ఈ నెల 26, 27 తేదీల్లో చిత్తూరులో జరగనున్న మహాసభలకు ప్రజలు సహకరించాలన్నారు. ఓబుల్‌రాజు, గిరిధరగుప్త, ఈశ్వరయ్య, ధనలక్ష్మి పాల్గొన్నారు.


పుంగనూరు: దుర్గాదేవిని పురవీధుల్లో ఊరేగిస్తున్న భక్తులు


పుంగనూరు: వజ్రకవచ అలంకారంలో కన్యకాపరమేశ్వరి ◆ పుంగనూరు: నవధాన్యాలతో మారెమ్మ ◆ కుప్పం: కొత్తపేట కన్యకా పరమేశ్వరీ ఆలయంలో.. ◆ బైరెడ్డిపల్లె: అశ్వ వాహనంపై శ్రీరామచంద్రస్వామి ◆ సదుంలో.. ◆ వి.కోటలో ◆ పెద్దపంజాణి: శ్రీరామాపురంలో.. ◆ శాంతిపురంలో గంగమాంబ ◆ పుంగనూరు గ్రామీణ: చినతండాలో..


కల్లూరులో..

ఊరూరా విజయ దశమి వేడుకలు

విజయదశమి సందర్భంగా అమ్మవారి ఆలయాల్లో పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయాల్లో అభిషేకాలు, ధూపదీప, నైవేద్యాలు పెట్టారు. సకల దేవతల స్వరూపిణి జగన్మాతను భక్తితో కొలిచారు. పండగ పూట అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. అన్ని చోట్ల గ్రామోత్సవం నిర్వహించారు.

- న్యూస్‌టుడే, పుంగనూరు


బైరెడ్డిపల్లెలో శ్రీసల్లాపురమ్మ ఉత్సవ విగ్రహ ఊరేగింపు

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

కల్లూరు: పులిచెర్ల పంచాయతీ వగళ్లవారిపల్లె సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీయల్లమ్మ ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఆదివారం వైభవంగా జరిగింది. ఆలయ దీక్షితులు శ్రీనివాసమూర్తి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో గణపతి సహిత, మహాపూర్ణాహుతి పూజలను చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మురళీమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూచిక ఇలా.. గమ్యం తెలిసేదెలా..?



మండలంలోని పలమనేరు-చౌడేపల్లె మార్గంలో రోడ్డుకు ఇరువైపులా సూచికలు చెట్లల్లో దాక్కున్నాయి. ప్రయాణికులు, వాహనదారులకు మార్గనిర్దేశం చేయాల్సిన సూచికలు.. కనిపించకపోవడంపై పలువురు పెదవి విరుస్తున్నారు. కనీసం నిర్వహణకు కూడా చేపట్టలేరా అని ప్రశ్నిస్తున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనచోదకుల అవగాహన కల్పించేందుకు ర.భ అధికారులు సూచికలు ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణ పట్టించుకోక ఇలా నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారని ఆరోపించారు. ఈ మార్గంలో చాలా మలుపులు ఉన్నాయి. ర.భ అధికారులు చెట్ల కొమ్మలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరతున్నారు. - న్యూస్‌టుడే, పెద్దపంజాణి

బండ్లు శిథిలం.. సిబ్బందికి కష్టం

మున్సిపల్ పరిధిలో చెత్త తరలించడానికి ఉపయోగించే తోపుడు బండ్లు పాడయ్యాయి. అన్ని మరమ్మతులకు గురికావడంతో సిబ్బంది అవస్థలు పడుతున్నారు. దాదాపు 10 సంవత్సరాల కిందట సమకూర్చినవి కావడంతో శిథిల దశకు చేరుకున్నాయి. మున్సిపల్ పరిధిలో మొత్తం 40 బండ్లు ఉండగా అందులో సగానికి పైగా దెబ్బతిన్నాయి. పట్టణంలోని 16 వేల నివాసాల నుంచి ఈ వాహనాల ద్వారా చెత్త సేకరించాలి.

ఈ సమస్యపై పుర కమిషనర్ ఎన్వీ రమణారెడ్డి వివరణ కోరగా.. కొత్త బిన్లు ఇవ్వడానికి టెండర్లు పిలిచామని.. త్వరలో పంపిణీ చేస్తామన్నారు. బండ్లకు మరమ్మతులు చేయిస్తామన్నారు. - న్యూస్‌టుడే, పలమనేరు


పూర్తిగా దెబ్బతిన్న తోపుడు బండి



గుంతలు.. ప్రయాణంలో కుదుపులు

పుంగనూరు -వనమలదిన్నె రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారింది. ద్విచక్ర వాహనదారులు, పాదచారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిపూట ప్రమాదాలు జరిగి పలువురు బాధితులుగా మారుతున్నారు. పుంగనూరు నుంచి మేలుందొడ్డి, మేకంజామనపల్లె, వనమలదిన్నె వరకు రోడ్డు మరమ్మతులు చేసి సమస్య పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఎంపీడీవో లీలామాధవి దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి.. పనులకు ప్రతిపాదనలు పంపుతామన్నారు. - న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణ

కంకర రోడ్డుపై నరక ప్రయాణం



కమ్మనపల్లె-కీలతొరడి రోడ్డు తారు నిర్మాణానికి నోచుకోకపోవడంతో ప్రజలు అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. గత తెదేపా ప్రభుత్వంలో ఈ రోడ్డు అభివృద్ధికి ఈఏపీ నిధుల నుంచి రూ. 2.31 కోట్లు కేటాయించారు. వైకాపా ప్రభుత్వంలో కల్వర్టులు నిర్మించి కంకర పరిచారు. తారు వేయకుండా వదిలేశారు. మూడేళ్లుగా కంకర రోడ్డుపై ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. కమ్మనపల్లె, ఎర్రకదిరేపల్లె, కీలతొరడి, గోపాలపురం, గడ్డిండ్లు గ్రామాల ప్రజలు నిత్యం ఇదే మార్గంలో రాకపోకలు సాగించాలి. తారు నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. పీఆర్ ఏఈ విద్యాసాగర్ వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. -న్యూస్‌టుడే, బైరెడ్డిపల్లె


విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానించిన పూర్వ విద్యార్థులు

పాఠశాల అభివృద్ధికి సహకారం

కల్లూరు, న్యూస్‌టుడే: కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల 1991-92 పది బ్యాచ్ విద్యార్థులు 32 ఏళ్ల తర్వాత ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విశ్రాంత ఉపాధ్యాయులు జయరత్నమ్మ, నటరాజకు పూర్వ విద్యార్థులు సన్మానం చేశారు. పాదాభివందనం చేశారు.

పూర్వవిద్యార్థుల చేయూత..సోమల: స్థానిక ఉన్నత పాఠశాలలో 1981-82 పది బ్యాచ్ పూర్వవిద్యార్థులు ఆదివారం పాఠశాల హెచ్‌ఎం హరినాథ్‌తో సమావేశమయ్యారు. పూర్వ విద్యార్థుల తరపున రూ.60 వేలతో శుద్ధజల కేంద్రం చుట్టూ కంచె నిర్మిస్తామని హామీ ఇచ్చారు.

క్రికెట్ విజేత గోపిశెట్టిపల్లె

పుంగనూరు, న్యూస్‌టుడే: మండలంలోని చదళ్లలో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఈ నెల 4నుంచి 12వ తేదీ వరకు నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతగా గోపిశెట్టిపల్లె జట్టు నిలిచింది. యన్వీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో విజేతకు రూ.50,116, రన్నర్ జట్టుకు రూ.30,116, మూడో స్థానంలో నిలిచిన వారికి రూ.15,116, బహుమతులు ట్రస్టు అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి అందించారు.


ప్రోత్సాహక బహుమతి అందిస్తున్న యన్వీఆర్ ట్రస్టు అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి

తెదేపా నాయకుల ధర్నా

కల్లూరు, న్యూస్‌టుడే: పోలీసులు తెదేపా నాయకులకు చెందిన ట్రాక్టర్లు పట్టుకుని.. అనవసరంగా జరిమానాలు విధిస్తున్నారంటూ ఆపార్టీ నాయకులు శనివారం రాత్రి కేకేపేట నాలుగు రోడ్ల కూడలిలో బైఠాయించారు. కల్లూరు ఎస్సై వెంకటేశ్వర్లు, సీఐ సూర్యనారాయణకు వ్యతిరేకంగా నిదానాలు చేశారు. ఎంపీటీసీ సభ్యుడు మునికృష్ణమనాయుడు, నాయకులు గోపీనాయుడు, దేవా, ధనంజయనాయుడు, రవి మాట్లాడుతూ శనివారం రాత్రి పోలీసులు కేకేపేట ఆంజనేయస్వామి ఆలయం వద్ద తనిఖీలు చేసి ట్రాక్టర్లు పట్టుకున్నారని తెలిపారు. ఇంత జరుగుతున్నా.. పోలీసులు అక్కడికి రాలేదు. సమాచారం తెలుసుకున్న చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ తెదేపా నాయకులతో చరవాణిలో మాట్లాడి సర్దిచెప్పారు.)ఈఘటనపై ఎస్సై వెంకటేశ్వర్లు వివరణ కోరగా వారి వద్ద ఎలాంటి దస్త్రాలు లేవని అందుకు జరిమానా విధించినట్లు చెప్పారు.

ఇద్దరికి గాయాలు.. వి.కోట: మండల పరిధిలోని ఆళ్వారిపల్లె, నడిపేపల్లె గ్రామాల మధ్య ద్విచక్రవాహనం, ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వి.కోట వైపు వస్తున్న ఆటో ముదరందొడ్డి వైపు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. గోనుమాకులపల్లె గ్రామానికి చెందిన శ్రీనివాసులు, శోభన్‌బాబు గాయపడగా చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వృద్ధుడికి.. పుంగనూరు గ్రామీణ: రోడ్డుపై నడుస్తున్న వృద్ధుడిని బైక్ ఢీకొన్న ప్రమాదంలో అతనికి గాయాలయ్యాయి. మండలంలోని భీమగానిపల్లె పంచాయతీ రాంపల్లిలో ఆదివారం రాత్రి వెంకటరమణ (70) రోడ్డుపై నడుస్తుండగా మదనపల్లె వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. ప్రమాదంలో వృద్ధునికి తీవ్ర గాయాలయ్యాయి. పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం మదనపల్లెకు తరలించారు.

కోడి పందెం స్థావరంపై దాడి.. రామకుప్పం: పంట పొలాల్లో కోడి పందేలు నిర్వహిస్తున్న పలువురిని అదుపులోకి తీసుకున్నట్లు కుప్పం గ్రామీణ సీఐ మల్లేశ్ యాదవ్ తెలిపారు. చెల్దిగానిపల్లిలో ఆదివారం మధ్యాహ్నం కోడి పందేలు ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు రాళ్లబూదుగూరు, వి.కోట, గుడుపల్లి ఎస్సైలు నరేశ్, బాబు, శ్రీనివాసులు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. పది మందిని అదుపులోకి తీసుకుని.. వారి నుంచి రూ.17650 నగదు, కోళ్లు స్వాధీనం చేసుకున్నారు.

అవీ.. ఇవీ.. అన్నీ..

మూగజీవాల రవాణా నివారించాలి.. పుంగనూరు: రాయలసీమలో పేరొందిన పుంగనూరు పశువుల సంత నుంచి కబేళాలకు మూగజీవాలు తరలించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని అఖిల భారత గో రక్షా జాతీయ కార్యదర్శి అయూబ్‌ఖాన్, రాజంపేట పార్లమెంటు భాజపా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు నరసింహులు శనివారం పలమనేరు డీఎస్పీ ప్రభాకర్‌కు వినతి పత్రం అందించారు. ఈనాడులో 'యథేచ్ఛగా మూగజీవాల అక్రమ రవాణా' శీర్షికతో ప్రచురితమైన కథనం చూపారు.

సంతాపం.. చౌడేపల్లె: విశ్రాంత హెచ్‌ఎం ఎస్. రంగనాథగుప్త (94) మూడు రోజుల క్రితం బెంగళూరులో మృతిచెందారు. ఆదివారం ఆయన చిత్రపటానికి 1983-84, 1984-85, 1986-87 పదో తరగతి బ్యాచ్‌ల విద్యార్థులు సంతాపం తెలిపారు.

వరద బాధితులకు సాయం..: కుప్పం పట్టణం: విజయవాడ వరద బాధితులకు కుప్పం సాయి మాతా సేవా ట్రస్టు ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు అందించినట్లు ట్రస్టు వ్యవస్థాపకుడు జగదీష్ బాబు తెలిపారు. కుప్పం ప్రాంతంలో సేకరించిన విరాళాలు బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు, దుస్తులు అందించినట్లు తెలిపారు. పునీత్ అంజన్, ప్రసాద్, అశ్వత్, రమేష్ పాల్గొన్నారు.

ప్రజలంతా సన్మార్గంలో నడవాలి.. పుంగనూరు: సమాజం అన్ని రంగాల్లో ముందుకెళ్లడానికి ప్రతి ఒక్కరూ మంచి మార్గంలో నడవాలని నవ్యాన బౌద్ధ సంక్షేమ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు సుమిత్ర రమణ కోరారు. శనివారం రాత్రి స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట నేటి యువత బుద్ధుడు, అశోకుడు, పూలే, అంబేడ్కర్ వంటి మహనీయుల చరిత్ర తెలుసుకోవాలన్నారు.

158 దరఖాస్తులు.. పుంగనూరు: సర్కిల్ పరిధిలోని 14ప్రైవేటు మద్యం షాపులకు 158దరఖాస్తులు దాఖలయ్యాయని ఎక్సైజ్ సీఐ సురేష్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పుంగనూరు, చౌడేపల్లె సోమల, పెద్దపంజాణి మండలాల్లో 14 మద్యం షాపులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. చిత్తూరులో లాటరీ ఉంటుంది.

మాజీ ఎఫ్‌ఏపై దాడి.. సోమల: మండలంలోని పొదలకుంటపల్లె పంచాయతీ వడ్డిపల్లె మాజీ ఎఫ్‌ఏ విజయకుమార్ శనివారం అనారోగ్యంతో బాధపడుతూ నంజంపేటలో మెడికల్ షాప్‌కు వెళ్లారు. మాత్రలు తీసుకొని ఇంటికి ద్విచక్ర వాహనంలో బయలుదేరగా అదే గ్రామానికి చెందిన చాంద్‌బాష అడ్డగించి దాడి చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు నమోదు చేసినట్లు ఎస్సై శివశంకర్ ఆదివారం తెలిపారు.

ఎద్దడి పడగ.. నిర్లక్ష్యం వీడక



వినియోగంలోకి తీసుకురాని ట్రాక్టర్లు, ట్యాంకర్లు ◆ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బోరు

గుడుపల్లె, న్యూస్‌టుడే: మండల పరిధిలోని పలు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చింది. వర్షాభావంతో గ్రామాల పరిధిలో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. ఫలితంగా బోర్లు వట్టిపోతున్నాయి. నీటి ఎద్దడిని పాలకవర్గాలు తమకు అనుకూలంగా మార్చుకుని ప్రైవేట్ ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నాయి. అయితే గ్రామాలకు నీటిని అందించేందుకు మండల కేంద్రంలోని మండల పరిషత్ ఆవరణలో బోరు వేశారు. రెండు ట్రాక్టర్లు, ట్యాంకర్లు అందుబాటులో ఉన్నాయి. దీని కోసం రూ. లక్షలు వెచ్చించారు. వీటిని వినియోగించే వీలున్నా.. కమీషన్ల కోసం ఒక్కో ట్యాంకరు రూ. 580 వెచ్చించి ప్రైవేట్ వ్యక్తులు సరఫరా చేసేలా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం పొగురుపల్లె, గుడుపల్లె, చీకటిపల్లె, సి.గొల్లపల్లె, శెట్టిపల్లె, దాసిమానిపల్లె, కడతనపల్లె పంచాయతీల పరిధిలోని 16 గ్రామాలకు నిత్యం 27 ట్యాంకర్లు వెళ్తున్నాయి. అందుబాటులో అన్నీ వనరులున్నా.. ప్రభుత్వ ఖజానాకు చిల్లు పెడుతున్నారు. గుడుపల్లె ఎంపీడీవో తాజ్ మస్రూర్ మదనపల్లెకు బదిలీ అయ్యారు. ఇక్కడికి కేటాయించిన లీలా మాధవి విధుల్లో చేరకపోవడం గమనార్హం.

త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

పుంగనూరు, న్యూస్‌టుడే: ముంబై- చెన్నై జాతీయ రహదారిపై స్థానిక భగత్‌సింగ్ కాలనీ వద్ద ఆదివారం ఉదయం ప్రమాదం త్రుటిలో తప్పింది. మదనపల్లె నుంచి గుడియాత్తం వెళ్తున్న లారీ టైర్లకు మంటలు అంటుకున్నాయి. అప్రమత్తమైన డ్రైవరు లారీని పక్కకు నిలిపి అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం అందించాడు. హుటాహుటిన సంఘటనా స్థలాన్ని చేరుకుని మంటలు అదుపు చేశారు.

విశ్రాంత ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలి

పలమనేరు, న్యూస్‌టుడే: గత ప్రభుత్వం బకాయిలు చెల్లించలేదని విశ్రాంత ఉద్యోగుల సంఘం అసోసియేట్ అధ్యక్షులు గురురాజారావు తెలిపారు. ఆదివారం పట్టణంలోని నార్త్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రూ.21 వేల కోట్ల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉందని.. ప్రస్తుత ప్రభుత్వం వాస్తవాలు ప్రకటించడం హర్షనీయమన్నారు. 5 సంవత్సరాలుగా పెన్షనర్లకు రావాల్సిన బకాయిలు తీసుకోకుండానే వేలాది మంది మృతిచెందారన్నారు. ఈ సమస్యపై తమకు ప్రస్తుత ప్రభుత్వం సానుకూలంగా స్పందించి 12వ వేతన కమిటీ ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కృష్ణమూర్తి, బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు